గోదావరి ఉగ్రరూపం

- పరీవాహక ప్రాంత ప్రజల ఆందోళన
- గంట గంటకూ పెరుగుతున్న నదీ ప్రవాహం

కె.గంగవరం: ఏటా వర్షాకాలం వచ్చిందంటే గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలకు వరదల కారణంగా ఆందోళనతో కంటి మీద కునుకు కరువవుతోంది. గత నెల రోజుల వ్యవధిలో మూడోసారి గోదావరి ఉగ్రరూపం దాల్చింది. తాజాగా ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి భారీగా వరదనీరు చేరుతోంది. వరద నీటిని కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదలడం వల్ల కోటిపల్లిలో పలు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. మండల పరిధిలోని కూళ్ల నుంచి బ్రహ్మపూరి వరకు వరద గోదావరి పరవళ్లు తొక్కుతోంది.

లంకల్లోనే పశువులు

సముద్రంలోకి వరద నీరు కలిసేందుకు ఉరకలు వేస్తూ ప్రవహిస్తోంది. శనివారం ఉదయం నుంచి గంట గంటకూ గోదావరి పెరుగుతూనే ఉందని స్థానికులు అంటున్నారు. రాత్రికి రాత్రే ఒక్కసారిగా గోదావరికి వరద పెరగడంతో లంకల్లోనే పశువులు ఉండిపోయాయి. ఆదివారం ఉదయం రైతులు లంకల్లో ఉన్న పశువులను రైతులు గట్టుకు చేరుస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారుల హెచ్చరిక నేపథ్యంలో మత్స్యకార కాలనీలో ఆందోళన నెలకొంది.

నిలిపోయిన పంటు ప్రయాణం

గోదావరి వరదనీరు భారీగా వచ్చి చేరడంతో కోటిపల్లి–ముక్తేశ్వరం పంటు ప్రయాణాన్ని రెవెన్యూ అధికారులు నెల రోజులుగా నిలిపివేశారు. రేవుదాటిన తరువాత ముక్తేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన కంకర రోడ్డు గోదావరిలో కొట్టుకుపోయింది. ఎన్నడూ లేని విధంగా రెండు తూరలు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో పంటు ప్రయాణానికి ఆటంకం కలిగింది. వరద ఉధృతి పూర్తిగా తగ్గిన తరువాత రోడ్డు నిర్మించి పంటు ప్రయాణానికి అనుమతిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.



కోటిపల్లి రేవులో పుష్కరఘాట్ వద్ద ప్రమాద హెచ్చరికను దాటిన వరద గోదారి



పంటు ఎక్కేందు వెళ్లే రహదారిలోని షాపుల వద్దకు చేరిన వరద నీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. మరో రెండు మూడు రోజుల్లో గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉంది. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గోదావరిలోకి అనుమతి లేకుండా బోట్లు, నాటు పడవలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నాం. అధికారులను అప్రమత్తంగా చేశాం. గట్టు బలహీనంగా ఉన్న చోట్ల మండల, పంచాయతీ అధికారులతో కలిసి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

– జానీ బాషా, ఎస్సై

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

- దుర్గామాతగా దర్శనమిచ్చిన విజయదుర్గ అమ్మవారు
- అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ

రాయవరం: మనస్సులో ఉండే అరిషడ్వర్గాలను విడనాడితే దైవత్వానికి దగ్గర కావచ్చునని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. పీఠంలో విజయదుర్గ అమ్మవారు ఆదివారం దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠానికి హాజరైన భక్తులనుద్దేశించి 'గాడ్' ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. విజయదుర్గ అమ్మవారిని ఉదయం దుర్గాదేవి రూపంలో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూల పూజలు కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పీఠం కిటకిటలాడింది. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ భక్తులకు అన్నసమారాధన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా సామూహిక కలశ పూజలు: స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద గురువారం కలశ పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో కలశ పూజల్లో పాల్గొన్నారు. ముందుగా కలశాలను శిరస్సున ధరించి మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి సమయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



దుర్గాదేవి రూపంలో వెదురుపాక విజయదుర్గ అమ్మవారు



ప్రత్యేకాలంకరణలో సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

కిటకిటలాడిన ఆలయాలు

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవార్లను దుర్గాదేవి రూపంలో అలంకరించి పూజలు చేశారు. రాయవరంలోని పార్వతి సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో, సోమేశ్వరం చారిత్రక శివాలయమైన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మహాచండీ దేవిగా మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రం, త్రిలింగ క్షేత్రంగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సావాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం మాణిక్యాంబ అమ్మవారి మట్టి ప్రతిమకు శ్రీ మహాచండీ దేవిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవాని ఆధ్వర్యంలో పండితులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కాత్యాయనీ దేవిగా అలంకరించారు. ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ముంపులో కాజ్‌వేలు

అయినవిల్లి: వరద ఉధృతికి మండలంలోని ముక్తేశ్వరం– అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే ఆదివారం ముంపునకు గురైంది. దీంతో లంక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పడవలపై ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయలో వరద ఉధృతి కొనసాగుతోంది. పాత వంతెనపై వరదనీరు ఐదు అడుగులు దాటి ప్రవహిస్తుంది.

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక ప్రజలతో పాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగ్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు రెండున్నర నెలలుగా పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వరదలు తగ్గకుండా కొనసాగుతుండటంతో లంక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



ముక్తేశ్వరం- అయినవిల్లి లంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై వరద నీరు

శ్రమించారు.. సాధించారు

- ఒకే గ్రామం నుంచి ఉపాధ్యాయులుగా ఏడుగురి ఎంపిక
- వీరిలో ఆరుగురు మహిళలే కావడం విశేషం
- విజేతలకు వెంటూరు గ్రామస్తుల ఘన సత్కారం

రాయవరం: వారంతా పూర్తిగా గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు. చదువులో ఎవరికీ తీసిపోమని నిరూపించారు. ఉపాధ్యాయ వృత్తిలోకి చేరాలని అహర్నిశలు కష్టపడి విజయకేతనం ఎగురవేశారు. ఈ ఏడాది నిర్వహించిన మెగా డీఎస్సీలో రాయవరం మండలం వెంటూరు నుంచి ఏడుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో ఆరుగురు మహిళలే కావడం విశేషం. ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందుకున్న వీరంతా త్వరలోనే పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటికే గ్రామంలో ఎనిమిది మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా వివిధ ప్రదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యాభిమానులు నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో వారిని 'సాక్షి' పలకరించగా తీవ్రమైన పోటీని ఎదుర్కొని, ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

రోజుకు 16 గంటలు శ్రమించా



డీఎస్సీ పోటీ పరీక్షల్లో 19వ ర్యాంక్ సాధించాను. ఓపెన్ కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యాను. డీఎస్సీ ఎంపిక కావడానికి ముందు కాకినాడ జీజీహెచ్‌లో ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎఫ్ఎన్ఓ)గా విధులు నిర్వర్తించాను. రాత్రి డ్యూటీ చేసి, పగటిపూట డీఎస్సీకి సిద్ధమయ్యాను. రోజుకు 16 గంటల పాటు శ్రమించాను. నా భర్త ఖండవిల్లి భరత్‌కుమార్, పిల్లల ప్రోత్సాహం, సహకారంతో ఈ విజయాన్ని అందుకున్నాను.

– ఉందుర్తి వీరవేణి

స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక



మొదటి ప్రయత్నంలో ఎస్జీటీగా ఎంపిక కాగా, ప్రస్తుతం మూడవ ప్రయత్నంలో స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్)గా ఎంపికయ్యాను. 388వ ర్యాంక్‌ను సాధించాను. ప్రస్తుతం కాకినాడ కార్పొరేషన్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్నాను. సెలవురోజులు, రాత్రి సమయంలో కష్టపడి ప్రణాళిక ప్రకారం చదివాను. ఒక పక్క కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూ పట్టుదలతో కృషి చేశాను.

– గిలకా దుర్గాభవాని

కల నెరవేరింది



టీచర్‌గా ఎంపికై విద్యార్థులకు బోధన చేయాలన్నది నా కల. రెండవ ప్రయత్నంలో 338వ ర్యాంకు సాధించి ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యాను. వివాహమై ఇద్దరు పిల్లలున్న నేను కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూనే డీఎస్సీకి ప్రిపేరయ్యాను. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే ఇంటి దగ్గర ఉంటూ రోజుకు 18 గంటల పాటు శ్రమించాను. చాలా సంతోషంగా ఉంది.

– వాసంశెట్టి మంగాలక్ష్మి

ఇంటి వద్దే ఉంటూ చదివాను

ప్రస్తుతం గృహిణిగా ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. భర్త నానాజీ పెయింటింగ్ పని చేస్తూ నన్ను చదువుకునేందుకు ప్రోత్సహించారు. పిల్లలను చూసుకుంటూ ఇంటి దగ్గరే ప్రతి రోజు 8 గంటల పాటు ప్రణాళిక ప్రకారం చదివాను. డీఎస్సీలో 304వ ర్యాంకు సాధించడం ద్వారా ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యాను. రెండవ ప్రయత్నంలో విజయం సాధించాను.

– కొండయ్యపాలెపు కృష్ణవేణి

కఠోర సాధనతో సాధించా



డీఎస్సీలో టీచర్ కొలువు సాధించాలని కఠోర శ్రమ చేశాను. ఉదయం ఆరు నుంచి రాత్రి 12 గంటల వరకు చదివాను. 140వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యాను. నా భర్త చంద్రమహారాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉంటూ నన్ను చదువులో ప్రోత్సహించారు. ఆయన సహకారంతోనే నేను ఈ విజయాన్ని అందుకున్నాను.

– మేడిశెట్టి స్వాతి

సమయాన్ని వృథా చేయలేదు



చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివాను. డీఎస్సీలో 293 ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యాను. కోచింగ్ తీసుకున్న అనంతరం ఇంటి దగ్గర నుంచే ప్రిపేరయ్యాను. పంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నా భర్త కోట లక్ష్మణకుమార్ ప్రోత్సాహంతో రెండవ ప్రయత్నంలో టీచర్ పోస్టుకు ఎంపికయ్యాను.

– వాసంశెట్టి శిరీష

రెండవ ప్రయత్నంలో నెరవేరిన లక్ష్యం



డీఎస్సీ రాసి ఉద్యోగాన్ని పొందడం ఆనందంగా ఉంది. రెండవ ప్రయత్నంలో 135వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యాను. టీచర్‌గా ఎంపిక కావాలనే పట్టుదలతో విజయవాడలో కోచింగ్ తీసుకున్నా. రోజుకు 10–12 గంటలు కష్టపడ్డాను. నా కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది.

– తుంపాల వీవీఎస్వై మణికంఠ

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో షిరిడీ సాయి ఊరేగింపు



హసన్‌బాదలో ప్రత్యేక అలంకరణలో బాబా

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో షిరిడీ సాయిబాబా జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని 130 అడుగుల కల్యాణ సాయి సాయి కోటి స్థూపం వద్ద ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆరతులు, సుప్రభాత సేవ, అభిషేకాలు, ఉచిత సామూహిక సాయి సత్య వ్రతాలు, బాబా వారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సాయి సేవకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరనారి ఐలమ్మ పోరాటం ఆదర్శనీయం



కోటిపల్లిలో ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న రజక సంఘం నాయకులు

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లిలో ఆదివారం వీర వనిత చిట్యాల చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కొత్తపల్లి దుర్గాప్రసాద్, మల్లిపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి వెంకటరమణమాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన ఐలమ్మ ఆదర్శనీయురాలని కొనియాడారు. ఏఎంసీ డైరెక్టర్ రామచంద్రపురం మండల అధ్యక్షుడు కేశనకుర్తి వెంకటేశ్వరరావు, కె.గంగవరం మండల అధ్యక్షుడు కాకినాడ వెంకటరమణ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాలకొల్లు సత్యనారాయణ, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



ద్రాక్షారామలో కళాకారులు సరోజ, రాఘవరాజును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రామచంద్రపురం రూరల్: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని మండల బీజేపీ అధ్యక్షుడు ఆకేటి శ్రీ కృష్ణ, మండల బీజేపీ పక్వాడా కన్వీనర్, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ద్రాక్షారామలో ఘనంగా నిర్వహించారు. గుర్రం జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళ, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన రంగ స్థల, సినీ నటి ద్రాక్షారామ సరోజ, కవి, సాహితీవేత్త, బాషా పండితుడు తటవర్తి రాఘవరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాడ్రేవు వెంకట్రావు, ఇందన సత్యనారాయణ, బీజేపీ నాయకులు పుల్లెల రామమూర్తి, గూటాల దక్షిణామూర్తి, బీవీబీఎల్ నారాయణ, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు



రావిదొడ్డిపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కె.గంగవరం: మండల పరిధిలోని భట్లపాలిక శివారు రావిదొడ్డిపేటలో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలకు డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై చేరి అసౌకర్యంగా ఉంటోందని ప్రజలు అంటున్నారు. డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని నాయకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించడం వల్ల దోమలు పెరిగి కాలనీవాసులు రోగాలబారిన పడుతున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం వస్తే వర్షపు నీరుతో పాటు మురుగునీరు కలిసి రోడ్డుపైనే ప్రవహిస్తోందని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాని వారు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి సహాయం

కపిలేశ్వరపురం: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని మాచర గ్రామానికి చెందిన గుబ్బల శ్రీనివాసుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.9 లక్షలు ఎల్‌ఓసీని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. మండపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, నాయకులు గొడవర్తి సత్యనారాయణ, కోన భగవాన్, అడపా సత్తిబాబు, వనుం సుబ్బారావు, జుత్తుగ శ్రీనివాసరావు, గుత్తుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కాలినడకన అమ్మవారి సన్నిధికి భవానీ భక్తులు



విజయవాడకు పాదయాత్రగా బయలుదేరిన భవానీ భక్తులు

రాయవరం: భవానీ మాలధారణ చేసిన పలువురు భక్తులు కాలినడకన విజయవాడకు తరలి వెళ్లేందుకు పయనమయ్యారు. పాదరక్షలు లేకుండా కాలి నడకన సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మవారి సన్నిధికి ఇరుముడితో బయలు దేరి వెళ్లేందుకు భవానీ మాలధారులు బయలుదేరారు. రాయవరంలో కాపుల రామాలయం వద్ద ఉన్న దుర్గా పీఠం, శెట్టిబలిజ రామాలయం వద్ద ఉన్న పీఠం నుంచి 12 మంది విజయవాడకు పాదయాత్రగా బయలుదేరారు. గోపికృష్ణ, కురుపూడి మణికంఠ గురుభావానీల ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. విజయవాడలో అమ్మవారికి ఇరుముడి చూపించిన అనంతరం భక్తులు తిరిగి ఇంటికి వచ్చి పీఠం ఉద్వాసనతో మాలధారణ ముగిస్తామని భవానీ భక్తులు తెలిపారు.

పురస్కార గ్రహీతకు అభినందనలు

కపిలేశ్వరపురం: గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఇటీవల తూర్పుగోదావరి జిల్లా చెల్లపిళ్ల కళా సేవా సమితి మండపేటకు చెందిన గండి స్వామి ప్రసాద్‌కు జాషువా సాహితీ పురస్కారాన్ని అందజేయడంపై పలువురు అభినందనలు తెలిపారు. మండపేటకు చెందిన సంగమం సాహితీ సంస్థ నిర్వాహకులు డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ మెహర్ ప్రసన్న ఆదివారం స్వామి ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి



ద్వారపూడిలో భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కపిలేశ్వరపురం: భారత విప్లవకారుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక కార్యకర్త పెద్దిశెట్టి రామకృష్ణ అన్నారు. మండలంలోని అంగరలో తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా 'భగత్‌సింగ్ జీవితం – నేటి యువతకు ఆదర్శం' పేరుతో సదస్సును నిర్వహించారు. సామ్యవాద సమాజాన్ని సాధించాలన్న భగత్‌సింగ్ లక్ష్యాన్ని నేటి యువత చేరుకోవాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మండపేట మండలం ద్వారపూడి చీపుర్లు మార్కెట్‌లోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతా ప్రసాద్, తెల్లాకుల శివ ప్రసాద్, కటకం సాయి, గ్రంధి రామచంద్రరావు, మహమ్మద్ ఆలీషా, మహమ్మద్ కాలేషా, జి.శివ పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్



ఆలమూరు: మండలంలోని చింతలూరులో ఆదివారం కొండచిలువ హల్‌చల్ చేసింది. స్థానిక గౌడ వీధిలో పాడి రైతు వాకా వెంకటేశ్వరరావు తన పొలంలో పశువులకు గడ్డి కోస్తుండగా సుమారు పది అడుగుల పొడవైన కొండచిలువ కంటబడింది. దీంతో అప్రమత్తమైన అతను తన ప్రాణ రక్షణ కోసం స్థానికుల సాయంతో కొండచిలువను వధించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా ఇటీవల కాలంలో పొలాల్లో విష సర్పాలు అధికంగా ఉంటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మృతదేహం లభ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో ఈ నెల 22వ తేదీన గల్లంతైన మండపేట మండలం తాపేశ్వరానికి చెందిన యలమంచిలి సురేంద్రకుమార్(22) మృతదేహం కపిలేశ్వరపురంలో లభ్యమైంది. శనివారం రాత్రి లభ్యమైన ఈ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సుభానీ అతని బంధువులకు అప్పగించారు. ఈ నెల 22న సురేంద్రకుమార్ పుష్కర్ ఘాట్‌లో స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే.